# రచయితలు

కె. ఎల్. కాంతా రావు

★

ఆంధ్రదేశపు ఛోటారచయిత సీతాపతిగారు దిగాలుపడి నుంచున్నారు పవరుపేట ప్లాటుఫారంమీద. వారిచుట్టూ మూడు పెద్ద ట్రంకు లున్నాయి. వారికొక దిగులు పట్టుకొంది. అవి రైల్లోకి ఎల్లా జేరుతాయా అని. కూలివాడిని పిలచి మాట్లాడపోతే వాడు అరణాలు అడిగాడు. జేరం ఆడకుండా వాడిని తరిమేసారు సీతాపతిగారు అంత అడిగాడన్న కోపంకొద్దీ. వాడు ఎక్కడకో పోయాడు. మిగతా కూలివాళ్లెవరూ ఒప్పుకో లేదు. జగిగినదానికి వారిప్పుడు పశ్చాత్తాపం పడడం మొదలెట్టారు.

రైలు రానే వచ్చింది. సీతాపతిగారు హుంకరించి ఒక పెట్టె చెవులు పుచ్చుకు లేవదీసి, రైల్లో పెట్టారు అతి కష్టంమీద. దాంతో వారి దమ్ములు అయిపోయాయి. వారిక అభిమానం చంపుకొని ప్లాటుఫారంమీద సంచితో పోతున్న ఒకాయన్ని నిలిపి కాస్త సామాను తోడుపట్టుమని బతిమాలార్ను. ఆయన వీరిని ఎగాదిగా చూసి పెట్టెలు రెండూ రైల్లోకి సాయంపట్టి వీరి పక్కనే కూర్చున్నాడు.

మెల్లిగా యిద్దరూ సంభాషణలోకి దిగారు. యుద్ధం, రేషనుబియ్యం, కంట్రోలు, సినిమాలు, నాటకాలు, చదువులు మొదలైనవాటిని గురించి కొంతసేపు మాట్లాడారు. సీతాపతిగారు చివరకు ఆయన్ని అడిగారు. "మీరు ఏమి చేస్తుంటారు.?" అని.

ఆయన "ఏవో కథలు అవీ రాస్తుంటానండి పత్రికలకు" అన్నాడు.

"అల్లాగా! అయితే మనిద్దరిది ఒకే లైను అన్న మాట" అన్నారు సీతాపతిగారు.

"మీరుకూడ కథలు రాస్తారా?" అని ఆయన ఆశ్చర్యపడి, సీతాపతిగారి పేరు అడిగి తెలుసుకొన్నాడు.

తరువాత వారిద్దరు దాదాపు మౌనంగావున్నారు. బెజవాడలో సీతాపతిగారి ట్రంకులు దింపి ఆయన వెళ్ళిపోయాడు.

సీతాపతిగారు ఇంటికి వెళ్ళి తన రైల్వే ప్రయాణాన్ని వర్ణిస్తూ వ్యాసం రాశారు.

"నేను పవరుపేట స్టేషనులో ఒక పెద్దమనిషిని చూసాను. ఆయన నాపెట్టెలు రైల్లోకి కొంచెం సాయంపట్టాడు. నాకు మహోపకారము చేసినట్లు ఫీలయాడు. ఆయన నాతో కొన్ని కొన్ని విషయాలను గురించి తనకుగల భావాలు ముచ్చటించాడు. నాకు చాల నవ్వు వచ్చింది. అతి కష్టం మీద అపుకొన్నాను..." ఇల్లా నడిచింది వ్యాసం.

మరుసటి నెలలో సీతాపతిగారి వ్యాసం వెలువడింది. దాంతోపాటు సంపాదకుడి పొగడ్తకూడ వుంది. సీతాపతిగారు పొంగిపోయారు.

మూరు సాంవత్సరం మరొక పత్రిక తిరగవేసుంటే ఒక వ్యాసం కళ్ళపడింది. దాన్లో "పవరుపేటలో పెదమషాకాయన మూడు గేదెదూడల్లాంటి పెట్టెలు ఎక్కించలేక బాధపడుతుంటే సాయంచేశాను. ఈ రోజుల్లో అల్లా మొయ్యలేని బరువుతో బయలుదేరటం చాల బుద్ధితక్కువ పని. ఆయనతో చాలసేపు మాట్లాడాను. ఆయనకు చాల చిన్న విషయాలు తెలియవు—రైలు ఆవిరితో నడుస్తుందనీ, దానికి గార్డు, డ్రైవరు వుంటారని—ఇలాంటివి పైగా అతనొక రచయితట. ఇల్లాంటి వాళ్ళు ప్రజలను ఏమి మరామతు చేస్తారు?" ఈ విధంగా నడిచింది ధోరణి.

వ్యాసం తనమీదేనని గ్రహించి మండిపడ్డారు సీతాపతిగారు. చప్పున యింటికిపోయి కుర్చీలో పోయి కూర్చొని ప్రయాణం సంగతులు జ్ఞాపకం చేసుకొని ఝాంఝ ఘాటైన వ్యాసం రాసిపారేశారు. దానికి మూడు అణాలు పోస్టేజీ ఎక్కువ కట్టి పత్రికకు పంపించారు.

తరువాత కథ వూహించుకోవచ్చు. ఇద్దరు రచయితలు కాట్లకుక్కలలాగ పోట్లాట ప్రారంభించారు. రెండు పత్రికలు వాళ్ళ రచనలను చేరదీసి ప్రకటించటం ప్రారంభించారు.